పాఠశాలల పనులు మన్నికగా చేయాలి

తిమ్మాపూర్, మే 30: జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను మన్నికగా చేయాలని, విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపడాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. గురువారం తిమ్మాపూర్ మండలం అలుగునూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కాకతీయ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అన్ని పాఠశాలల్లో జూన్ 4లోగా పనులు పూర్తయ్యేలా అధికారులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్ రావు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, తహసీల్దార్ కనకయ్య, ఐడీసీ డీఈ నాగేశ్వరాచారి, హెచ్ఎం షహనాజ్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాక్సిన్‌పై శిక్షణ

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుజాత

విద్యానగర్, మే 30: టీబీ వ్యాక్సిన్‌పై గురువారం కరీంనగర్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డీఎంహెచ్‌వో సుజాత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వైద్యులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, ఇప్పటివరకు జిల్లాలో క్షయ వ్యాధి నియంత్రణకు ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు మాత్రమే టీకా ఇచ్చామని, ఇకపై 18 సంవత్సరాల పైబడిన వారికి కూడా వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. షుగర్ వ్యాధిగ్రస్తులు, టీబీ వ్యాధి సోకిన వారితో నివసించే కుటుంబ సభ్యులు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధులు అతుల్ నిగమే, విష్ణు ఆదిత్య, డీఐవో డాక్టర్ సాజిద, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, పీవో ఎంసీహెచ్ డాక్టర్ జువేరియా పాల్గొన్నారు.

'పారమిత'లో ఉపాధ్యాయులకు శిక్షణ

కమాన్‌చౌరస్తా, మే 30 : జిల్లా కేంద్రంలోని పారమిత విద్యాసంస్థల్లో 2024–25 విద్యాసంవత్సరాన్ని పురస్కరించుకుని అనుభవజ్ఞులైన విద్యావేత్తలతో ఉపాధ్యాయ వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పారమిత పాఠశాలల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు మాట్లాడుతూ, శిక్షణ తరగతులకు ముఖ్య అతిథులుగా ప్రముఖ విద్యావేత్తలు ప్రొఫెసర్ డాక్టర్ హరీశ్ దరి, ప్రొఫెసర్ డాక్టర్ రాజారాం హాజరై ఉపాధ్యాయులకు సలహాలు సూచనలు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల చైర్మన్‌తో పాటు పాఠశాలల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

విద్యానగర్, మే 30 : ఆశా కార్యకర్తలకు పరీక్ష పెట్టి సర్టిఫికెట్లు ఇస్తామనే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ రెవెన్యూ అధికారి పవన్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ, ఆశా కార్యకర్తలకు కొత్తగా ఎగ్జామ్ పెట్టి గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కనీస వేతనం వెంటనే రూ.18వేలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ సంఘం జిల్లా అధ్యక్షురాలు రంగవేణి శారద, జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత, ఉపాధ్యక్షురాలు కొంకట వెంకటలక్ష్మి, నాయకురాళ్లు మహేశ్వరి, శోభ, కమల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'ఆరోపణలు సరికాదు'

కమాన్‌చౌరస్తా, మే 30 : శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధికి అడ్డుపడేలా పలువురు ఆరోపణలు చేయడం సరికాదని ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఎస్‌యూ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, జ్ఞానేశ్వర్ రావు, దేవేందర్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. యూనివర్సిటీలో యూజీసీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పూర్తి కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. యూనివర్సిటీ ఉద్యోగులు, సిబ్బంది ఎవరూ ఎప్పుడూ నిరసనలు చేపట్టకపోవడమే ఇందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. యూనివర్సిటీ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మాజీ వీసీ ప్రొఫెసర్ మల్లేశ్ సంకసాల అనేక కార్యక్రమాలు చేపట్టారని, ఇందులో భాగంగానే జీవో నం. 1222 తీసుకువచ్చి అమలు చేశారని తెలిపారు. ఈ సంవత్సరం కూడా ఆ జీవోను పునరుద్ధరించే ప్రయత్నాలు జరుగుతున్న క్రమంలో పలువురు యూనివర్సిటీ బయటి వ్యక్తులు అడ్డు తగలడం సరికాదని పేర్కొన్నారు.

విద్యుత్‌లైన్ పనులను పరిశీలించిన ఎస్ఈ

హుజూరాబాద్ రూరల్, మే 30: వెంకట్రావుపల్లి గ్రామంలోని 33/11 కేవీ లైన్ పనులను గురువారం ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ పరిశీలించారు. వెంకట్రావుపల్లి సబ్‌స్టేషన్‌కు వీణవంక మండలం బేతిగల్ నుంచి రూ .67 లక్షలతో నూతన లైన్ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ, విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయంగా ఈ లైన్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఈ లక్ష్మారెడ్డి, ఏడీఈ శ్రీనివాస్, రూరల్ ఏఈ రవీందర్ తదితరులున్నారు.

36 పరీక్ష కేంద్రాలు.. 18,663 మంది అభ్యర్థులు

- గ్రూప్ 1 ప్రిలిమ్స్‌కు ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం
- సమీక్షించిన కలెక్టర్ పమేలా సత్పతి

గ్రూప్ 1 ప్రిలిమినరీ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, మే 30 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తున్నది. జిల్లాలో 18,663 మంది అభ్యర్థులు హాజరుకానుండగా, 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో 34 ప్రైవేట్, రెండు ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఏర్పాటు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ పమేలా సత్పతి సంబంధిత అధికారులతో కలెక్టరేట్ సమావేశమందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు విధిగా ఉండేలా చూడాలన్నారు. హాళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పటిష్టమైన పోలీసు బందోబస్తు చేపట్టాలని ఆదేశించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు బయోమెట్రిక్ ఉంటుందని, పూర్తిస్థాయిలో తనిఖీలు చేసిన అనంతరమే పరీక్ష హాల్‌లోకి అనుమతించాలన్నారు. ఉదయం 9 గంటల వరకే కేంద్రాలకు చేరుకోవాలని, 10 గంటలకు కేంద్రాల గేట్లు మూసివేస్తారని, పరీక్ష ముగిసే వరకు ఎట్టిపరిస్థితుల్లో గేట్లు తిరిగి తెరవబోరని స్పష్టం చేశారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని వెల్లడించారు. టీజీపీఎస్సీ రూపొందించిన నిబంధనలను అభ్యర్థులు విధిగా పాటించాల్సిందేనన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించేది లేదని తేల్చిచెప్పారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది మందులతో అందుబాటులో ఉండాలని సూచించారు. ఓఎంఆర్ షీట్లు, ప్రశ్న పత్రాలను పటిష్ట భద్రత నడుమ స్ట్రాంగ్‌రూముల్లోకి తరలించాలని, పరీక్షకు ముందు తగిన పోలీస్ బందోబస్తుతో కేంద్రాలకు ప్రశ్నపత్రాలు, ఓ ఎంఆర్ షీట్లు పంపిణీ చేయాలన్నారు. పరీక్ష ముగిసిన అనంతరం ఓఎంఆర్ షీట్ల సంఖ్యను సరిచూసుకోవాలన్నారు. పరీక్ష సందర్భంగా నగర వీధుల్లో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు వచ్చేటప్పుడు ఏదైనా గుర్తింపుకార్డు తీసుకురావాలన్నారు. కేంద్రాల్లో సిబ్బంది కదలికలపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష రోజున కేంద్రాల్లో ఎంతమంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారో గుర్తించి, జాబితాలు తయారుచేసి పోలీస్ అధికారులకు అందజేయాలన్నారు. కేంద్రాల్లోకి ఇన్విజిలేటర్లు సైతం సెల్‌ఫోన్‌లు వెంట తీసుకెళ్లరాదని, టీజీపీఎస్సీ నిబంధనల మేరకు అధికారులు నడుచుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్డీవో కె.మహేశ్వర్, అడిషనల్ డీసీపీ జె.కుమార్, కొండగట్టు జేఎన్టీయూ కళాశాల ప్రొఫెసర్ బి.సతీశ్‌కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీచరణ్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి, మాస్ మీడియా అధికారి రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'దోస్త్' రిజిస్ట్రేషన్ గడువు పెంపు

కమాన్‌చౌరస్తా, మే 30 : దోస్త్ మొదటి ఫేజ్ రిజిస్ట్రేషన్ గడువు జూన్ 1వ తేదీ వరకు పొడిగిస్తూ తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రకటన విడుదల చేసింది. ఈ క్రమంలో మొదటి విడుతలో వెబ్ ఆప్షన్లు జూన్ 2వ తేదీ వరకు పెట్టుకునే వెసులు బాటు కల్పించింది.

బాలసదన్, శిశుగృహం సందర్శన

కలెక్టరేట్, మే 30: జిల్లా కేంద్రంలోని బాలసదన్, శిశుగృహను శిక్షణ న్యాయ మూర్తులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సదనంలోని బాలికలతో ముచ్చటించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు తరగతుల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. చిరుప్రాయం నుంచే కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగచ్చని ఉద్బోధించారు. శిశుగృహలోని పిల్లలకు అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, బాలసదన్ నిర్వాహకురాలు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్, మే 30: జూన్ 2న నిర్వహించనున్న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆదివారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రసంగం ఉంటుందని, వేడుకలకు హాజరయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులకు సమాచారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అమరవీరుల కుటుంబాలను సన్మానించనున్నట్లు వెల్లడించారు. అలాగే గ్రామ పంచాయతీలు, మున్సిపల్, మండల ప్రజాపరిషత్‌లు, జడ్పీ కార్యాలయంలో కూడా వేడుకలు నిర్వహించాలని సూచించారు. ఆయా కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. పోలీసుల గౌరవ వందనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, వేడుకలు అట్టహాసంగా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వేడుకల నిర్వహణకు కలెక్టరేట్‌లో అనువైన స్థలాన్ని పరిశీలించారు. అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో పవన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, సూపరింటెండెంట్ కాళీచరణ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కరీంనగర్ రూరల్, మే 30 : మండలంలోని దుర్శేడ్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సీడీపీవో పీ లక్ష్మీనారాయణ తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా కేంద్రాల్లోని సౌకర్యాలను పరిశీలించారు. వాటిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

బీసీల కులగణన చేపట్టాలి

తెలంగాణచౌక్, మే 30: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ కుల సంఘాల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కులగణన జరిగే వరకు స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, నాయకులు రాకేశ్, జీఎస్ ఆనంద్, నరేశ్, శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర చిహ్నాన్ని మార్చడం మూర్ఖపు నిర్ణయం

కలెక్టరేట్, మే 30: తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో గల కాకతీయుల తోరణం, చార్మినార్ బొమ్మలను తొలగించడం మూర్ఖపు నిర్ణయమని తెలంగాణ మేధావుల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ డా.సారంగపాణి విమర్శించారు. తెలంగాణలో కాకతీయ రాజుల ప్రశాంత పాలనకు చిహ్నంగా భావించే కాకతీయ తోరణం, హైదరాబాద్ ఐకాన్‌గా ప్రపంచ దేశాల్లో పేరొందిన చార్మినార్‌ను తొలగించడం కక్షపూరిత విధానాలకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రజాభిప్రాయం మేరకు తెలంగాణ తొలి ప్రభుత్వం ఆవిష్కరించిన రాష్ట్ర చిహ్నంలో తెలంగాణ సాంస్కృతిక చిహ్నాలు చేర్చడం సముచితమే అయినా, గతంలో ఉన్న వాటిని తొలగించడం అవివేకమని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

కలెక్టరేట్, మే 30 : దేశంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల జీవనం కోసం చేపట్టిన ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఉపాధి హామీ కూలీల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగ్గిడి రాములు, వెన్న వెంకటేశ్వర్లు ఆరోపించారు. గురువారం నగరంలోని మంకమ్మతోటలో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వారు మాట్లాడుతూ, ఉపాధి హామీ కూలీలకు పెరిగిన ధరలకనుగుణంగా రోజుకు రూ.600 చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. పనిచేసే చోట నీడ తాగునీరు, మెడికల్ కిట్లు, పనిముట్లు సమకూర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై నిరసన తెలిపేందుకు జూన్ 10న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన భారీ సదస్సులో ప్రతినిధులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఉపాధి హామీ చట్టం, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీల సమస్యలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గంతో పాటు పలు మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సుభాష్

చిగురుమామిడి, మే 30: రేకొండ గ్రామానికి చెందిన గొడిశాల సుభాష్ గౌడ్ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం కరీంనగర్‌లో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం ప్రకాశ్, ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్, ప్రచార కార్యదర్శి దాసరి ప్రవీణ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ నియామక పత్రం అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం పటిష్టం కోసం కృషి చేస్తానని నూతన జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్ గౌడ్ పేర్కొన్నారు.

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి

జమ్మికుంట, మే 30: రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని, విద్యాసంస్థల్లో నిత్యం తనిఖీలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చూడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు డిమాండ్ చేశారు. గురువారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫీజుల పేరుతో లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టాన్ని తేవాలని కోరారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జమ్మికుంటలో అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, పర్మిషన్ లేని సంస్థలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలన్నారు. విద్యారంగాన్ని మరింతగా బలోపేతం చేయాలని కోరారు. సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటామని, విద్యార్థులను విస్మరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇక్కడ పలువురు విద్యార్థి నాయకులు, తదితరులున్నారు.

పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం

- నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్
- మెడికవర్ ఆధ్వర్యంలో బల్దియా పారిశుధ్య కార్మికులకు అవగాహన

మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్

విద్యానగర్, మే 30: పొగాకు వాడకం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో శానిటేషన్ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఏ అలవాటైనా వాటిని ఉపయోగించే వారికి మాత్రమే నష్టం చేస్తుందని, ఒక్క పొగతాగడం మాత్రం పక్క వారికి కూడా హాని చేస్తుందని తెలిపారు. ఇంట్లో ఎవరు పొగ తాగినా బంద్ చేయించాలని సూచించారు. యువతలో స్మోకింగ్ అనేది స్టైల్‌గా మారిందని, పెద్దవాళ్ల ప్రభావం కూడా పిల్లలపై ఉంటుందన్నారు. మనం పొగాకు వస్తువులను నిషేధిస్తేనే ఫ్యాక్టరీలు బంద్ అవుతాయని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్ నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం వల్ల 50 శాతం మంది కార్మికులైనా పొగాకు మానితే సంతోమేనన్నారు. సైకియాట్రిస్ట్ డాక్టర్ వర్షి మాట్లాడుతూ, పొగాకు అతిగా వాడకం వల్ల మతిస్థిమితం కూడా కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. పొగాకు మాన్పించడం కోసం మెడికవర్‌లో వైద్యం అందుబాటులో ఉందన్నారు. న్యూరో సర్జన్ డాక్టర్ వెంకటేశ్ మాట్లాడుతూ, పొగాకు వాడకంతో హార్ట్ ఎటాక్‌తో పాటు బ్రెయిన్ స్ట్రోక్ కూడా వస్తుందన్నారు. దీంతో కాళ్లు, చేతులు పడిపోవడం, మతిమరుపు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ... యువత పొగతాగడానికి బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్ వైజర్ రాజమనోహర్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవిమల్లారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన

జమ్మికుంట, మే 30: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్నదని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని జడ్పీటీసీ డాక్టర్ శ్రీరాం శ్యాం ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళలకు కేవలం ఉచిత బస్సు సౌకర్యం మాత్రమే అందుతున్నదని, కాంగ్రెస్ ఇచ్చిన మిగతా హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రభుత్వం కావాలనే రాజముద్రను మార్పు చేస్తున్నదని, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కాలయాపన చేయడాన్ని తప్పుబట్టారు. హామీలు, ప్రజా సమస్యలను పట్టించుకోకుంటే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు నాయకులున్నారు.

మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి

శంకరపట్నం, మే 30: అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద ఎంపికైన తాడికల్ పాఠశాలలో మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీవాణి కాంట్రాక్టర్‌కు సూచించారు. గురువారం ఆమె పాఠశాలను సందర్శించారు. మరమ్మతు పనుల పురోగతిని పరిశీలించారు. పాఠశాలలు పునర్ ప్రారంభమయ్యేలోగా పనులను పూర్తి చేయాలన్నారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శి సమ్మ రాజేశ్వర్, చైర్మన్ రమాదేవి, వీవో, తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తిమ్మాపూర్ రూరల్, మే 30: మొగిలిపాలెం గ్రామ ముదిరాజ్ సంఘం నూతన అధ్యక్షుడిగా తాట్ల తిరుపతి, ఉపాధ్యక్షుడిగా గుర్రం సంపత్, కార్యదర్శిగా శ్రీకాంత్, డైరెక్టర్లుగా దయ్యాల రాజ్ కుమార్, కుంభం మధు, సంపత్, పర్శయ్య, సమ్మయ్య, మల్లయ్య గురువారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

ఎండ తీవ్రతకు వృద్ధుడు మృతి

శంకరపట్నం, మే 30: మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో మంతపురి ఎల్లయ్య (67) అనే వృద్ధుడు ఎండ తీవ్రతకు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎల్లయ్య గురువారం మధ్యాహ్నం తన ఇంటి నుంచి కాసేపు పొలం వద్దకు వెళ్లి వచ్చాడు. ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక వైద్యున్ని పిలిచేలోగానే ప్రాణాలు విడిచినట్లు తెలిపారు. ఎల్లయ్యకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

తెలంగాణచౌక్, మే 30: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గొర్ల ఐలేష్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. బీసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

చొప్పదండి, మే 30: పట్టణంలోని జాన్‌డీర్ షోరూం వద్ద ప్రమాదవశాత్తు ఓ లారీ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. డివైడర్ ప్రారంభంలో ఎలాంటి సూచికలు లేకపోవడంతో వాహనదారులు నేరుగా వచ్చి దానిని ఢీకొని ప్రమాదానికి గురవుతున్నారు. ఘటనా స్థలాన్ని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మున్సిపాలిటీ నిర్లక్ష్యంతోనే నూతనంగా నిర్మాణం చేసిన డివైడర్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వాటి నివారణకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

డివైడర్‌కు ఢీకొన్న ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

సామిల్లుల్లో 'ఫైర్‌సేఫ్టీ' నిల్

- తనిఖీలు మరిచిన ఫైర్ అధికారులు
- వెంకటేశ్వరస్వామి సామిల్లులో అగ్నిప్రమాదం

హుజూరాబాద్, మే 30: జనావాసాల మధ్య కలప వ్యాపారం నిర్వహిస్తున్న పలు సామిల్లులు, టింబర్ డిపోలలో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకపోవడం ప్రజలకు ప్రాణసంకటంగా మారుతున్నది. ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన అగ్నిమాపకశాఖ అధికారులు మిన్నకుండడం విమర్శలకు తావిస్తున్నది. హుజూరాబాద్ పట్టణపరిధిలోని బోర్నపల్లిలోని వెంకటేశ్వరస్వామి సామిల్లులో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం జరుగగా, అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రమాదానికి కారణం స్పష్టంగా తెలియకపోగా, మంటలు ఎగిసిపడ్డాయి. అయితే వాటిని ఆర్పేందుకు అందుబాటులో ఎలాంటి పరికరాలు లేకపోవడంతో నిలువ చేసిన కలప కాలిపోయి రూ.5లక్షల నష్టం వాటిల్లింది.

ఏ ఒక్కదానికీ ఫైర్‌సేఫ్టీ అనుమతి లేదు

హుజూరాబాద్ పట్టణపరిధిలో 11 సామిల్లులు, ఆరు టింబర్ డిపోలుండగా వీటిలో ఏ ఒక్కదానికి ఫైర్‌సేఫ్టీ అనుమతి లేదు. ఇవన్నీ జనావాసాలు, జనసమ్మర్ద ప్రాంతాల్లో ఉండడం వల్ల తమ పరిస్థితి కుంపటి మీద కూర్చున్నట్లు ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తాజాగా వెంకటేశ్వరస్వామి సామిల్లులో జరిగిన అగ్నిప్రమాదంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. మంటలు వేగంగా విస్తరించి ఉండి ఉంటే చుట్టు పక్కల ఇండ్లల్లో ఉండే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇక సామిల్లులు, టింబర్ డిపోలలో తనిఖీలు చేయాల్సిన అగ్నిమాపక శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రమాదాలు చోటుచేసుకుంటే తప్ప అసలు వాటి వైపు వెళ్లరనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తనిఖీలు ముమ్మరం చేస్తే ప్రజల ప్రాణాలు కాపాడినవారవుతారు.

నిబంధనలు పాటించాల్సిందే



సామిల్లులు, టింబర్ డిపోల యజమానులు అగ్ని ప్రమాదాలు జరిగితే మంటలు ఆర్పడానికి ప్రత్యేక పరికరాలు తప్పనిసరిగా సమకూర్చుకోవాలి. కరెంట్ మోటరు, పైపులైన్ నామమాత్రంగా కాకుండా పని చేసేలా ఎప్పటికప్పుడు చూసుకోవాలి. ముఖ్యంగా నీళ్ల ట్యాంకు నిర్మించుకోవాలి. వీటిన్నింటిపై సామిల్లులు, టింబర్ డిపోలలో అవగాహన కల్పిస్తున్నా కొందరు యజమానులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా వారు తమ ప్రవర్తన మార్చుకొని ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు.

–సీహెచ్ రాజయ్య(ఫైర్ ఆఫీసర్)

మా కాలేజీలో చేరితే సెల్‌ఫోన్ కొనిస్తం

- డిగ్రీలో చేరే విద్యార్థులతో యాజమానుల బేరసారాలు
- 'దోస్త్' నోటిఫికేషన్ రాగానే రంగంలోకి పీఆర్వోలు
- ఆశలు చూపుతూ ప్రవేశాలు

'మా కాలేజీలో చేరితే మీకు మంచి సెల్‌ఫోన్ కొనిస్తం. పరీక్ష ఫీజు చెల్లిస్తం. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో మంచి ఉద్యోగం కల్పిస్తం.' ఇలా విద్యార్థులకు ఆశచూపుతూ మాయమాటలు చెబుతూ పలు కాలేజీలు యాజమానులు డిగ్రీలో చేర్చుకుంటున్నారు. దోస్త్ నోటిఫికేషన్ రాగానే తమ పీఆర్వోలను రంగంలోకి దింపుతున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థుల ఇండ్లవద్దకు వెళ్లి ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ఈ వ్యవహారం అధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి.

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మే 30: 'జిల్లా కేంద్రంలోని ఒక ప్రముఖ డిగ్రీ కళాశాలలో డిగ్రీ థర్డ్ ఇయర్ చదువుతున్న విద్యార్థికి నువ్వు కళాశాలలో చేరి మరో ఇద్దరిని చేర్పిస్తే ఫీజు మాఫీ చేసి, ఫ్రీ బస్ సౌకర్యం, లాబ్ ఫీజ్‌లో మాఫీ చేస్తామని చెప్పారు. ఇది నమ్మిన సదరు విద్యార్థి తాను చేరి మరో ఇద్దరిని చేర్పించాడు. ఆ తర్వాత సెమిస్టర్ ఫీజు కడితేనే ఫీజు హాల్ టికెట్ ఇస్తామని చెప్పారు. దీంతో ఆ విద్యార్థి పీఆర్వోను ప్రశ్నించగా, నిన్ను ఫెయిల్ కూడా చేయిస్తాం. 'సరిగ్గా ఫీజు కట్టి చదువుకో' అని బెదిరించారు. దీంతో చేసేది లేక విద్యార్థి అదే కళాశాలలో చదువు కొనసాగిస్తున్నాడు. ఫస్ట్ ఫేస్ రిజిస్ట్రేషన్లకు జూన్ ఒకటి వరకు గడువు పొడిగించడంతో ఇదే అదనుగా విద్యార్థులను అడ్డదారిలో చేర్పించుకుంటున్నారు. విద్యార్థులను చేర్పించిన పీఆర్వోలకు కాలేజీలో జాబ్‌తో పాటు ఒక విద్యార్థికి ₹3 నుంచి ₹6 వేల వరకు ముట్టచెబుతున్నట్టు తెలుస్తున్నది. అలాగే, మరికొందరు అడుగు ముందుకేసి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేసి సమీపంలోని ఆలయాలు, దర్శనీయస్థలాలకు కూడా తిప్పుతున్నట్టు సమాచారం.

కళాశాలల వద్దే ఫోన్ నంబర్లు

పీఆర్వోలు విద్యార్థులకు చెందిన ఫోన్ నంబర్లతో తామే రిజిస్ట్రేషన్ చేసి, విద్యార్థుల సర్టిఫికెట్లు సైతం తమ వద్దే పెట్టుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో విద్యార్థులు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ కళాశాలల పీఆర్వోలే వినియోగిస్తున్నట్లు సమాచారం. దీంతో ఒక కళాశాల నుంచి వేరే కళాశాలలకు విద్యార్థి వెళ్లే క్రమంలో సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ విషయంలో గత సంవత్సరం పలువురు విద్యార్థులు ఉన్న విద్యామండలికి సైతం వెళ్లి తమ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్, ఫోన్ నంబర్లు మార్చుకున్నట్లు తెలిసింది.

ఓటీపీలతో గోల్‌మాల్

సొంతంగా వెబ్ ఆప్షన్లు పెట్టుకున్న విద్యార్థులను పీఆర్వోలు ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. వెబ్ ఆప్షన్లు పెట్టుకున్న విద్యార్థులకు పీఆర్వోలు ఫోన్ చేసి, 'మేం ఒక కళాశాల నుంచి ఫోన్ చేస్తున్నాం. మీరు వెబ్ ఆప్షన్ పెట్టుకున్నారు కాదా, మీకు ఒక ఓటీపీ వస్తుంది చెప్పండి' అంటూ ఓటీపీ తీసుకుంటున్నారు. ఆ తర్వాత కళాశాల పేరు మార్చుతూ, తమ కళాశాలలో సీటు లభించేలా యత్నిస్తున్నారు. ఇదంతా తెలియని విద్యార్థులు ప్రాధాన్యత క్రమంలో లేని కళాశాల రావడంతో, ఇష్టం లేకున్నా చేరుతున్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు

తెలంగాణచౌక్/ వీణవంక/ హుజూరాబాద్ రూరల్/ మానకొండూర్ రూరల్, మే 30: జిల్లా వ్యాప్తంగా సీఐటీయూ 54వ ఆవిర్భావ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని యూనియన్ కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవనంలో జరిగిన వేడుకల్లో జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ నిరంతరం పోరాటాలను కొనసాగిస్తున్నదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం, సహాయ కార్యదర్శి పున్నం రవి పాల్గొన్నారు. మానకొండూర్ మండలం సదాశివపల్లిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుంద రెడ్డి జెండాను ఆవిష్కరించారు. వీణవంక మండలం ఎలుబాకలో హమాలీ వర్కర్స్ యూనియన్, ఉపాధి హామీ కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కమిటీ సభ్యుడు పిల్లి రవియాదవ్ జెండాను ఆవిష్కరించారు. ఇక్కడ కార్మిక నాయకులు కల్లెపు సంపత్‌రెడ్డి, బండి ఐలయ్య, అరుకాల సదయ్య, నల్లగోని తిరుపతి, తెడ్ల కుమార్ పాల్గొన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపో క్రాస్ వద్ద జిల్లా కమిటీ సభ్యుడు కదిరే రమేశ్ జెండాను ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శికి గాయాలు

వీణవంక, మే 30: విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న కిష్టంపేట పంచాయతీ కార్యదర్శికి రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా దాసరి కృపారాణి విధులు నిర్వర్తిస్తున్నారు. జమ్మికుంట పట్టణంలో నివాసం ఉంటున్న ఆమె, గురువారం విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. జమ్మికుంట శివారులో ప్రమాదవశాత్తు స్కూటీపై నుంచి పడగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే జమ్మికుంట దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతున్నారు.